ప్రీమియం చెల్లింపు గడువు పెంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.సత్యనారాయణ

భీమవరం : పిఎం సురక్ష జీవన యోజన ప్రీమియం చెల్లింపు గడువు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ కార్మికులకు ప్రమాదం జరిగి చనిపోతే కేవలం రూ.50 వేలు మాత్రమే ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇటీవల మొగల్తూరు నక్కవారిపాలెంలో ముగ్గురు కూలీలు రోడ్డు పక్కన పనిచేస్తున్న వారిపై వ్యాన్ దూసుకొచ్చి ముగ్గురు మరణించారని, అయితే వారి పక్షాన పోరాడిన ఫలితంగా రూ.రెండు లక్షల సహాయం ఒక్కొక్కరికి అందజేయడం జరిగిందన్నారు. ఈ ప్రమాదం దృష్టిలో పెట్టుకుని ఒక్కొక్క కూలి నుంచి రూ.20 చొప్పున ప్రీమియం వసూలు చేసి బ్యాంకులకు ఏప్రిల్ నెలాఖరు లోపల అందజేయాలనే నిర్ణయం మార్పు చేయాలని కోరారు. కూలీల నుంచి రూ.20 ప్రభుత్వం రూ.30 కలిపి చెల్లించి రూ.5 లక్షలకు బీమా పెంచే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

'సహకార' ఎన్నికలు లేనట్టే..!

పది జిల్లాలకు డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్ల నియామకం
'పశ్చిమ' డిసిసిబి ఛైర్మన్ పదవిపై వీడని ఉత్కంఠ
సహకార సంఘాలకు కమిటీలను నియమించనున్నట్లు ప్రచారం
రెండు జిల్లాల్లో 281 సహకార సంఘాలకు మళ్లీ కమిటీలే దిక్కా?
2018 నుంచి సహకార వ్యవస్థకు ఎన్నికలు లేకుండా చేసిన పాలకులు
గత ప్రభుత్వం దారిలో కూటమి సర్కార్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార వ్యవస్థకు ఇప్పట్లో ఎన్నికలు లేనట్టేనని తేలిపోయింది. వచ్చే జులై నెలలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఇప్పటి వరకూ అందరూ భావించారు. ప్రభుత్వం సోమవారం పలు జిల్లాలకు డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లను నియమిస్తూ ప్రకటన చేయడంతో ఇప్పట్లో సహకార వ్యవస్థకు ఎన్నికల్లో నిర్వహించే ఆలోచన ప్రభుత్వానికి లేదని అర్థమవుతోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు పాలించాల్సిన సహకార వ్యవస్థను ప్రభుత్వం తమ రాజకీయ అవసరాల కోసం నామినెటెడ్ పోస్టుల భర్తీలకు అలవంగా మార్చేసిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ నిర్ణయంతో మరోసారి సహకార వ్యవస్థ ప్రభుత్వం నియమించే కమిటీలతోనే సాగనున్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో 159, పశ్చిమలో 122 మొత్తం 281 సహకార సంఘాలు ఉన్నాయి. ఇవన్నీ ఏలూరు డిసిసిబి పరిధిలోనే నడుస్తున్నాయి. 2013 జనవరిలో కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాలకు, డిసిసిబి, డిసిఎంఎస్‌లకు ఎన్నికలు నిర్వహించింది. 2018 జనవరిలో పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆ పాలకవర్గాల పదవీకాలం పొడిగించింది. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సహకార సంఘాల ఎన్నికలను నిర్వహిస్తుందని అంతా భావించారు. అందుకు విరుద్ధంగా త్రిసభ్యకమిటీని నియమించింది. డిసిసిబికి ఛైర్మన్, ఇద్దరు డైరెక్టర్ల కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో దాదాపు ఎనిమిదేళ్లుగా సహకార సంఘాలకు ఎన్నికలు లేకుండాపోయాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. త్రిసభ్య కమిటీలను రద్దుచేసి ప్రత్యేక అధికారులను నియమించింది. అదే ఏడాది డిసెంబర్‌లో సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం సంకేతాలిచ్చింది. అందుకు విరుద్ధంగా మళ్లీ ప్రత్యేక అధికారుల కాలపరిమితిని ఆరునెలలు పొడిగించింది. సహకార సంఘాల్లో కంప్యూటీకరణ పూర్తయిన తర్వాత వచ్చే జులైలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్న ప్రచారం సాగింది. అనూహ్యంగా పది జిల్లాలకు డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లను ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దీంతో సహకార సంఘాల ఎన్నికలపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత వైసిపి విధానంలోనూ కూటమి సర్కార్ నడుస్తుందని స్పష్టమవుతోంది. సహకార సంఘాలకు ఎన్నికల జరగకపోవడంతో రైతులు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ఇబ్బందులను ఏ మాత్రమూ పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. కమిటీల ఏర్పాటు చేయడంతో సహకార సంఘాల్లో అవినీతి పెచ్చుమీరుతుందన్న విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

'పశ్చిమ' డిసిసిబి ఛైర్మన్‌పై వీడని ఉత్కంఠ

రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలు ఉండగా పది జిల్లాలకు డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లను ప్రకటించింది. పశ్చిమ డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లను ప్రకటించలేదు. ఇది జిల్లా నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది. డిసిసిబి ఛైర్మన్ పదవికి ఉంగుటూరు నియోజకవర్గ నాయకుడు వట్టి పవన్ తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జనసేన జిల్లా నాయకులు కొటికలపూడి గోవిందరావు డిసిసిబి ఛైర్మన్ రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. టిడిపి నుంచి డిసిసిబి ఛైర్మన్ పదవి ఆశిస్తున్న వారు పెద్దగా కనిపించడం లేదు. రాష్ట్రస్థాయి పదవి ఆప్కాబ్ ఛైర్మన్ పదవిని మాత్రం మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు ఆశిస్తున్నారు. డిసిసిబి ఛైర్మన్ పదవులను ప్రకటించడంతో సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీని నియమించనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పదవుల కోసం నాయకుల వద్దకు క్యూకడుతున్న పరిస్థితి నెలకొంది. ఏం జరుగుతుందో వేచిచూడాల్సి ఉంది.

సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదవాడ నాగరాణి సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలలా ప్రజల నుంచి వచ్చిన 246 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కాకుంటే మండల స్థాయి అధికారులతో చర్చించాలన్నారు. ఎక్కువ ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్న శాఖలకు ఈ నెల 30న గూగుల్ మీట్ ద్వారా వర్క్ షాప్ నిర్వహిస్తామని, సమస్యల పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు, ఎలా పరిష్కరించవచ్చు, తదితర విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్షాకాలం ముందే పూర్తిచేస్తాం

దమయపత్రి డ్రెయిన్ పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల

దమయపత్రి డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో రూ.14 కోట్లతో తలపెట్టిన దమయపత్రి మురుగు డ్రెయిన్ పనులు వర్షాకాలం ముందే పూర్తి చేయాలని ముందుకెళ్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. డ్రెయిన్ నిర్మాణ పనులను సోమవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2014కు ముందు పూర్తి కావాల్సిన డ్రెయిన్ పనులు ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేదని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు అవసరమైన నిధులు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్లను ఒప్పించి పనిచేస్తున్నట్లు చెప్పారు. కింద బురద ఎక్కువగా ఉండడంతో పెద్ద పనులు చేసే కాంట్రాక్టర్లను రప్పించి పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. 70 శాతం రైతన్నలున్న రాష్ట్రానికి జగన్ ఐదేళ్లలో ఉద్ధరించిందేమీ లేదని, వైసిపి భవిష్యత్తులో మనుగడ కష్టం అని మంత్రి చెప్పారు. జగన్ హయాంలో తట్ట మట్టి కూడా డ్రెయిన్‌లో తీయలేదన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని లంకలకోడేరు, వెంకటాపురం గ్రామాల్లో రూ.86 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. లంకలకోడేరులో రూ.20 లక్షలతో కోడేరు నంబర్ వన్ బ్రాంచ్ ఛానల్‌పై, గ్రావెల్ రహదారి నిర్మాణ పనులు, ఇదే కాలువపై మరో రూ.9.99 లక్షలతో తవ్వకం పనులు ప్రారంభించారు. వెంకటాపురంలో రాపాక ఛానల్‌పై రూ.41.50 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు, ఇదే కాలువపై రూ.9.95 లక్షలతో తవ్వకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి హయాంలో పాలకొల్లు నియోజకవర్గంలో పంట కాలవలు, డ్రెయిన్ల వెంబడి పెద్ద ఎత్తున గ్రావెల్ రహదారి నిర్మాణాలు చేపట్టామని, నేడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచి చొప్పల రజిని, పెనుమత్స వివేక్ వర్మ, కోడి విజయభాస్కర్, ఇంటి శ్రీరాముడు, నెక్కంటి ఆదినారాయణ, పెనుమత్స సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

అందరికీ ప్రత్యామ్నాయం చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్
రెండో రోజు సాగిన సిపిఎం బైక్ యాత్ర

బొండాడలో ఆందోళన చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్, నేతలు

ప్రజాశక్తి - కాళ్ల

అభివృద్ధి అంటే పేదల ఇళ్లు కూల్చేముందు ప్రత్యామ్నాయం చూపడమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఉండి నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు కాలుష్యం పేరుతో పేదల ఇళ్లను తొలగించడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ యాత్ర సోమవారం నియోజకవర్గంలో రెండో రోజు సాగింది. ఈ మేరకు కాళ్ల మండలంలోని వేంపాడు, బొండాడ, కాళ్ల, జువ్వలపాలెం గ్రామాల్లో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ కాలుష్యానికి కారణం ఏంటి అని తెలుసుకుని, దాని నివారణా చర్యలు చేపట్టకుండా పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకూ సమంజసమన్నారు. ఇప్పటికైనా పేదల ఇళ్లకు రక్షణ కల్పించాలని, కూటమి ప్రభుత్వం ఇస్తామన్న మూడు సెంట్ల స్థలాన్ని ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించే చర్యలు చేపట్టాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యాత్రలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, దనికొండ శ్రీనివాస్, కె.తవిటినాయుడు, చీర్ల శేషు, బివి.వర్మ, చందక సూరిబాబు, ఎస్‌కె.వలీ, కిషోర్, తిరుమాని శ్రీనివాస్, గండికోట వెంకటేశ్వరరావు, తిరుమాని సుబ్బారావు, కొల్లాటి రాజు, పరిరక్షణ కమిటీ నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ, పెద్దిరాజు, రమణ పాల్గొన్నారు.

ఆకివీడు : మండలంలో ఇటీవల ప్రభుత్వం తొలగించిన ఇళ్ల స్థానంలో ఆయా కుటుంబాల వారు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చే సాధారణ ప్యాకేజీతో పాటు అదనపు ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ డిమాండ్ చేశారు. సిపిఎం చేపట్టిన బైక్ ర్యాలీ సోమవారం మండలంలోని అయిభీమవరం, దుంపగడప, ధర్మాపుర అగ్రహారం, సిద్ధాపురం, కాలింగగూడెం, కోళ్లపర్రు, గుమ్ములూరు, తరటావ గ్రామాల్లో సాగింది. ఆయా గ్రామాల్లో పేదలకు పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్ల స్థలాలను బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడారు. కొన్నిచోట్ల ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినప్పటికీ వారికి స్వాధీనం చేయలేదన్నారు. మరికొన్ని చోట్ల స్వాధీనం చేసినా ఇళ్లు కట్టుకునేందుకు సహకారం అందించలేదని, మరి కొన్నిచోట్ల సరైన మౌలిక సదుపాయాలు లేవని వివరించారు. వెంటనే ప్రభుత్వం లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు స్వాధీనం చేసి పూర్తి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇళ్లు కూల్చివేసిన చోట వారికి ప్రభుత్వం సహజంగా అందించే సహకారంతోపాటు అదనపు ప్యాకేజీ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని, లేనిపక్షంలో తామే రంగంలోకి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కంశెట్టి లక్ష్మీనారాయణ, ఆకివీడు ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు, సందక సూరిబాబు, బి.రాంబాబు, సి.బలరాం, షేక్ వలీ పాల్గొన్నారు.

ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలి

జిల్లా కలెక్టర్‌కు కౌలు రైతుల సంఘం వినతి

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం తూకాల్లో మోసాలను అరికడుతున్నామని అధికారులు ఎన్ని మాటలు చెప్పినా ఆచరణలో అమలు కావడం లేదని, తక్షణం ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యం సంచితో కలిపి 40 కేజీల 500 గ్రాములు తూయాలన్నారు. కానీ అదనంగా 700 గ్రాములు తూస్తున్నారని తెలిపారు. దీంతో 100 సార మూటలకు రైతులు 70 కేజీల ధాన్యం రూ.1,510 నష్టపోతున్నారన్నారు. సంచులు 40 శాతం చిరిగిపోయి ఉంటున్నాయని తెలిపారు. రైతులు ధాన్యం సరిగ్గా శుభ్రం చేయడం లేదని అందుకే ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని చెప్పడం సరికాదని అధికారులు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో తేమ, నూక శాతం నిర్ధారించడానికి యంత్ర పరికరాలతో పాటు ప్రత్యేక అధికారులు కూడా ఉన్నారన్నారు. అటువంటప్పుడు రైతులు ధాన్యం నిర్ధారించి పంపకుండా అయిన కాడికి అదనంగా ఎలా ఇస్తారని అధికారులను రామాంజనేయులు ప్రశ్నించారు. తక్షణం తూకాల్లో మోసాలను అరికట్టి, గోనెసంచులు అందించాలన్నారు. జియోట్యాగ్‌తో సంబంధం లేకుండా రైతులు సొంతంగా ఏ వాహనాన్నైనా ఆన్‌లైన్ చేయించుకుని ధాన్యం పంపించే విధంగా అవకాశం కల్పించాలని కోరారు.

సుబ్బరాజు చెరువు ఇళ్ల తొలగింపు తీర్మానం తిరస్కరణ

పంచాయతీ సర్పంచి, కార్యదర్శులకు బాధితులు, సిపిఎం నేతల వినతి

సర్పంచి, కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు, సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రియ

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంతంలో ఇళ్ల తొలగింపునకు పంచాయతీ పాలకవర్గం తీర్మానాన్ని తిరస్కరించింది. రెండు నెలల క్రితం ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న 23 కుటుంబాలకు చెందిన గృహాలు తొలగించేందుకు అధికారులు నోటీసులు జారీచేశారు. ఎంఎల్ఎ రఘురామ కృష్ణరాజు దృష్టికి బాధితులు సమస్యను తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన 23 కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు వీటిని తొలగించేందుకు మరోసారి నోటీసులు జారీచేశారు. ఈ నేపథ్యంలో సిపిఎం బాధితులకు అండగా నిలిచింది. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మండల కార్యదర్శి శేషాపు ఆశ్రియ బాధితులతో కలిసి కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దృష్టికి సమస్యను తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. అయితే కలెక్టర్ సమస్యపై సానుకూలంగా స్పందించినప్పటికీ ఇళ్లు తొలగించేందుకు అధికారులు మరోసారి సిద్ధమయ్యారు. అయితే స్థానిక పాత పంచాయతీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ పాలక సమావేశం సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఇళ్ల తొలగింపునకు తీర్మానం ఇచ్చేందుకు పంచాయతీ పాలకవర్గ సభ్యులు నిరాకరించారు. తీర్మానంలో ఇళ్ల తొలగింపు అంశం పెట్టినట్లు తమకు తెలీదని, తొలగింపు ప్రక్రియ తమకు ఇష్టం లేదని, పాలకవర్గం సభ్యులు తీర్మానాన్ని తిరస్కరించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రియ, బాధితులు పంచాయతీ సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి, సుజాతకు వినతిపత్రాన్ని అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆశ్రియ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి 23 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, అర్ధాంతరంగా ఇళ్లను తొలగిస్తే వారంతా ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. తక్షణం వారికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

భీమవరం : ఉండి నియోజకవర్గంలో ఏకపక్షంగా బుల్డోజర్లతో పేదల ఇళ్లకు తొలగింపునకు నిరసిస్తూ, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు వైఖరిని ఖండిస్తూ మంగళవారం వామపక్షపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. భీమవరం మండల పరిషత్ కార్యాలయం రోడ్డులో ఉన్న సిఐటియు జిల్లా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం, ఇతర వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు పాల్గొంటాయన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో లబ్ధిదారుల ఫిర్యాదు

ప్రజాశక్తి - వీరవాసరం

గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో తక్షణమే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో తహశీల్దార్ ఎవి.రామాంజనేయులుకు కాలనీ లబ్ధిదారులు సిపిఎం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కాలనీల్లో ఎన్నో ఆర్థిక అవస్థలు పడి ఇళ్లు నిర్మించుకుంటే రోడ్లు, డ్రెయినేజీ, కరెంటు సదుపాయాలు లేక నానా అవస్థలు పడుతున్నామంటూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ఉత్తరపాలెం, మత్స్యపురిపాలెం కాలనీల్లో సరైన సదుపాయాలు లేకపోవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయన్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తమ కాలనీలకు రాకపోకలు సాగిస్తున్నామన్నారు. కొణితివాడ, నవుదూరు, బాలేపల్లిలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు నివాసాలకు యోగ్యంకావని, వాటిని రద్దు చేసి వేరే ప్రాంతంలో స్థలాలు కేటాయించాలన్నారు. అర్హులైన వారికే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వీరవాసరం తులసీ కన్వెన్షన్ వద్ద ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మాణపనులు ప్రారంభించాలనుకుంటే అక్కడ కరెంటు సదుపాయాలు లేవన్నారు. పెర్కిపాలెం, వీరవాసరం, ఉత్తరపాలెం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. పెర్కిపాలెంలో తాగునీటి చెరువు కలుషితానికి కారణమవుతున్న రొయ్యల సాగు చెరువులపై చర్యలు తీసుకోవాలన్నారు. 2017లో నిర్మించుకున్న ఇళ్లకు ఇంకా ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యాక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహారాజు, బాలం విజయకుమార్, యండమూరి సుబ్బారావు, పాలా కోటేశ్వరావు పాల్గొన్నారు.

ఎంపిపి, జెడ్‌పిటిసి హామీ : ఉత్తరపాలెం కాలనీలో రోడ్లు వేసేందుకు ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు హామీ ఇచ్చారు. సోమవారం వారి ఛాంబర్‌లో ఉత్తరపాలెం జగనన్న కాలనీ వాసులు కలిసారు. తమ కాలనీలో రోడ్లు లేక మట్టి దారుల వెంబడి రాకపోకలు సాగిస్తున్నామని, కాలనీకు కనీసం మంచినీరు తెచ్చేవారు కూడా రావడం లేదన్నారు. తమ కాలనీకు ఇటుకలు చేరవేసేందుకు కూలీలు ఒక ఇటుకకు ఒక రుపాయి, ఒక సిమ్మెంట్ బస్తాకు రూ.15 తీసుకుంటున్నారన్నారు. ఇటువంటి పరిస్థితులలో మట్టి రోడ్లు అభివృద్ధి చేయకపోతే అక్కడ మేము ఎలా నిర్మించుకోవాలో తెలపాలన్నారు. దీంతో స్పందించిన ఎంపిపి, జెడ్‌పిటిసిలు త్వరలోనే కాలనీలో ముందుగా గ్రావెల్ రోడ్లు వేయిస్తామంటూ హామీ ఇచ్చారు.

అభివృద్ధి చేస్తే అభినందిస్తాం

ప్రజలపట్ల అన్యాయంగా వ్యవహరిస్తే ఖండిస్తాం
కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు
పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో కెవిపిఎస్ బృందం పర్యటన

భీమవరం : ఉండి నియోజకవర్గంలో కూల్చిన పేదల ఇళ్లకు వెంటనే నష్టపరిహారం, ప్రత్యామ్నాయ స్థలాల్లో పూర్తిస్థాయి ఇళ్ల నిర్మాణం చేయాలని, అభివృద్ధి చేస్తే అభినందిస్తామని, ప్రజల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తే ఖండిస్తామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. పాలకోడేరు స్థానిక ఎఎస్ఆర్ నగర్‌లో కెవిపిఎస్ జిల్లా బృందం సోమవారం పర్యటించి బాధితులను పరామర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా క్రాంతి బాబు మాట్లాడుతూ 110 పేద కుటుంబాలు సుమారు 50 ఏళ్ల నుంచి నివసిస్తున్నారన్నారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు అభివృద్ధి పేరుతో ఇళ్లను కూల్చడం దుర్మార్గమన్నారు. నిజమైన అభివృద్ధికి ప్రజలందరూ సహకరిస్తారని, పేద ప్రజల ఇల్లు తొలగింపు వలనే అభివృద్ధి జరుగుతుందంటే ఎవరూ హర్షించరన్నారు. కూల్చిన పేదల ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న అన్ని సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు సామాగ్రిని ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు అందించడం అభినందనీయం అన్నారు. అదే సమయంలో పేదల ఇళ్లను అక్రమంగా కూల్చడం దుర్మార్గమన్నారు. ఇల్లు కూల్చుతానని బహిరంగంగా ప్రకటిస్తుంటే జిల్లాలో ఉన్న మంత్రి, ఆరుగురు ఎంఎల్ఎలు ఎందుకు నోరుమెదపరని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయం చూపకుండా అక్రమంగా ఇళ్లు కూల్చి వేతను ఆపాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి కె.బాలరాజు, సి.చిన్న నాగేశ్వరరావు, ఎం.గోపి, జిల్లా కమిటీ సభ్యులు జి.ఏడుకొండలు, నాయకులు ప్రసాద్, దుర్గాప్రసాద్, శేషపు అశ్రియ్య, మరియమ్మ పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలి

పహల్గాం దాడిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన భయానక ఉగ్రదాడిని ఖండిస్తూ భీమవరం పెద్ద మసీదు వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కెజిఆర్ఎల్ కళాశాల సంయుక్త కార్యదర్శి అరేటి ప్రకాష్, ముస్లిం కమిటీ ఛైర్మన్ షేక్ రబ్బానీ మాట్లాడుతూ ఈ ఉగ్రదాడి కేవలం కొందరిపై జరిగినది కాదని, దేశ ప్రజలందరిపై మానవతపై జరిగిన దాడి అని, ఉగ్రదాడుల ద్వారా అమాయకుల ప్రాణాలు తీయడం అనేది పిరికి చర్య అని అన్నారు. ఇటువంటి ఉగ్రదాడులతో దేశ ప్రజలను ఎవరూ భయపెట్టలేరని, ఇటువంటి చర్యలకు ప్రజలు ఐక్యతతో గట్టిగ సమాధానం చెబుతారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులలో పర్యాటకులు, ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారన్నారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ సభ్యులు ఎండి నౌషాద్, ఎంఎ అన్సారీ, ఎండి సాబు, ఎండి అబ్బర్, ఎండి భాషా, ఎండి బాది, ఎండి రబ్బాని పాల్గొన్నారు.

ఆకివీడు : ఉగ్రవాదాన్ని పెంచి పోషించడమే పాకిస్తాన్ లక్ష్యమని, అటువంటి ఉగ్రవాదాన్ని ఎటువంటి పరిస్థితుల్లో సహించనవసరం లేదని ఎఎంసి ఛైర్మన్ బొల్లా వెంకట్రావు అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా సోమవారం రాత్రి స్థానిక పాత బస్టాండ్ సెంటర్ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్, అడ్వకేట్ చేబోలు శ్రీనివాస్, టిడిపి చెరుకుమిల్లి గ్రామ నాయకుడు రాంబాబు పాల్గొన్నారు.

సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

పెన్షనర్ల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జేమ్స్, సత్యనారాయణరాజు

భీమవరం : సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్, (పెన్షన్స్) 1972కు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లు 2025లో కొన్ని సవరణలను తీసుకువచ్చిందని, ఆ సవరణలను పార్లమెంట్లో ఆమోదించుకొని చట్టంగా తీసుకురావడం జరిగిందని, దీనిని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాతల జేమ్స్, డాక్టర్ సాగిరాజు సత్యనారాయణ రాజు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అత్యవసర సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సవరణలు అమలు చేస్తే పాత పెన్షనర్లకు భవిష్యత్తులో పే రివిజన్ జరిగినప్పుడు ఏవిధమైన ప్రయోజనం ఉండదన్నారు. వారు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పెన్షనర్ల మధ్య వివక్షకు దారి తీస్తుందని చెప్పారు. పెన్షనర్లను రెండుగా విభజించే అవకాశం ఉందని, అందువల్ల ఆ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. భీమవరం యూనిట్ ప్రధాన కార్యదర్శి పి.సీతారామరాజు, యుజిసి రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు సాగి అప్పలరాజు మాట్లాడారు. కార్యక్రమంలో యూనిట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎయు భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు షేక్ చాన్ భాషా, ఆర్.సూర్యనారాయణ, పాండురంగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : ఆర్‌టిసి కార్మికులు

నరసాపురం: ఎపిఎస్‌ఆర్‌టిసి నరసాపురం డిపో ఆధ్వర్యంలో తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నుంచి కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ సెంటర్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన దీక్షలో భాగంగా రీజినల్ ఛైర్మన్ జి.సతీష్ బాబు మాట్లాడారు. ఉద్యోగుల ఉద్యోగ భద్రతా 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు అక్రమ రిమూవల్స్ ఆపాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలన్నారు. డిపో సెక్రటరీ తోట నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జిఒ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్యారేజ్ సెక్రటరీ కెఎ.సురేష్ బాబు, కమిటీ సభ్యులు కె.చంద్రరావు, ఇ.వెంకట రావు, బి.సురేష్ బాబు, జి.రామకృష్ణ పాల్గొన్నారు. **తాడేపల్లిగూడెం** : ఆర్‌టిసి డిపోలో ఎంఎంయుఎ ఆధ్వర్యంలో సిబ్బంది రిలే నిరాహార దీక్షలను ఎన్ఎంయుఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆలపాటి సూర్యచంద్రరావు, జోన్ ఉపాధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు ప్రారంభించారు. డిపో అధ్యక్షులు ఎంఎస్ బాబు, సెక్రటరీ ఎ.రవికుమార్, వైవి.రావు ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి

పెనుమంట్ర : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పే విధంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని మండల తహశీల్దార్ వై.రవికుమార్ అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎంఇఒ-2 బంగారు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తహశీల్దార్ వై.రవికుమార్ చేతుల మీదుగా విద్యాశాఖ కరపత్రం ఆవిష్కరణ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి గ్రామంలోని తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పించే విధంగా అవగాహన కల్పించడంలో భాగంగా ఆ గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ పెద్దల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించే విధంగా కృషిచేయాలని తహశీల్దార్ కోరారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి : ఇఒ

భీమవరం టౌన్ : ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పంచారామ క్షేత్రమైన భీమవరం శ్రీసోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానం ఇఒ రామకృష్ణంరాజు అన్నారు. సోమవారం భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమేశ్వర స్వామి ఆలయంలో భక్తులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం మనందరి బాధ్యత అని అన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలని అన్నారు. అనంతరం 100 మంది భక్తులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేగి రాణి, సిహెచ్.విశ్వనాథ రాజు, మున్సిపల్ సెక్రటరీలు విజిఆర్.రాజేశ్వరి, జి.శిరీష, కె.పెద్దిరాజు, పి.బేబీ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

111 గ్రాముల వెండి అందజేత

భీమవరం టౌన్ : భీమవరం మెంటేవారి తోటలోని బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి దాతలు 111 గ్రాముల వెండిని విరాళంగా అందించారు. సోమవారం పట్టణానికి చెందిన నరసింహమూర్తి శ్రీనివాస్, భాగ్యలక్ష్మి దంపతులు 100 గ్రాముల వెండి, బోల్ల దుర్గారావు, ఉమా దంపతులు 11 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ కమిటీ తరుపున ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్న సమారాధనలో యాత్రికులు

భీమవరం టౌన్ : భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 21వ తేదీ నుంచి 8 రోజులపాటు సాగిన శ్రీవారి కళ్యాణ బ్రహ్మోత్సవాలు సాంప్రదాయబద్ధంగా ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో స్వామివారికి మహా నివేదన చేసి అన్న సమారాధనను ప్రారంభించారు. వేలాది మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మందిర కార్యదర్శి కుక్కల బాల, సరిపిడకల రామారావు, జానపాటి మధు, పెన్మెత్స శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, మహిళా పారాయణ బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో మహిళలకే పెద్దపీట

ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం : వెనకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ ట్రైనింగ్ తరగతులను ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. సోమవారం పట్టణంలోని 8వ వార్డులో ప్రాథమిక జూనియర్ కళాశాల, 23వ వార్డు ప్రభుత్వ స్కూల్, పెంటపాడు మండల కార్యాలయంలో ఉచిత కుట్టుమిషన్ ట్రైనింగ్ శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బొలిశెట్టి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రధాని నరేంద్ర మోడీ వికసిత్ భారత్‌ను అందుబాటులోకి తెచ్చి ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరచుకుని, వారి కుటుంబాలని బలోపేతం చేసుకోవాలని ఆయన కోరారు. నేడు మూడు నెలలపాటు కొనసాగుతున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన నాయకులు వర్తనపల్లి కాశి, పుల్లా బాబీ, ఇతర ప్రభుత్వ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ఆకివీడు : కీర్తిశేషులు డాక్టర్ కె.జానకమ్మ జ్ఞాపకార్థం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్థానిక లయన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ మంగళవారం (నేడు) ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ జిల్లా అడిషనల్ సభ్యులు, మాజీ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజు తెలిపారు. స్థానిక ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి పక్కన ఉన్న పేరూరు వెంకటేశ్వర్లు, కాశీ రత్నమ్మ లయన్స్ భవనంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ శిబిరంలో చిన్నపిల్లల వైద్యులు, ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, జనరల్ మెడిసిన్, దంతవ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, స్త్రీ సంబంధిత వ్యాధుల ప్రత్యేక నిపుణులు శిబిరంలో వైద్య సేవలు అందిస్తారని ఆయన తెలిపారు. శిబిరం సాయంకాలం ఐదు గంటల వరకు ఉంటుందన్నారు.

నేడు ఆక్వా రైతులకు అవగాహనా సదస్సు

పెనుమంట్ర : జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో పెనుమంట్రలో ఈనెల 29 మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆక్వా రైతులకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామని సంఘం ప్రతినిధులు శ్రీనివాసరాజు, సాయి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పెనుమంట్రలోని శివాలయం పక్కన ఉన్న భూపతిరాజు శ్రీనివాసరాజు నివాస ప్రాంగణంలో జరిగే ఈ సదస్సుకు పరిసర ప్రాంతాలకు చెందిన ఆక్వా రైతులు అందరూ హాజరు కావాలని వారు కోరారు. ఈ సదస్సులో ఆక్వా సాగులో మెళకువలతో పాటు, సాగు యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

రికార్డుల పరిశీలన

మొగల్తూరు : రైతుల భూముల ఖచ్చితమైన హద్దులు గుర్తించి రికార్డులు ఆధునీకరించేందుకు ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కెపి పాలెం గ్రామంలో రీ సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పనులను, సరిహద్దుల మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూముల ఖచ్చితమైన హద్దులు గుర్తించి ప్రయోగాత్మకంగా రీసర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వే పనులు వేగవంతం చేయాలని అన్నారు. సర్వే నిర్వహించే ముందు భూ యజమానులకు తెలియజేయాలని వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని అధికారులను సూచించారు. రైతులు అభ్యంతరాలు ఏమైనా తెలియజేస్తే నమోదు చేసుకోవాలని అన్నారు. రైతుల భూముల ఖచ్చితమైన హద్దులను గుర్తించి రికార్డులు ఆధునీకరించేందుకు ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వే కార్యక్రమంలో తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ కె.రాజ్ కిషోర్, డివిజన్ సర్వే అధికారి కుమార్, మండల సర్వే ధనరాజ్, రీసర్వే డిటి, విఆర్‌ఒలు, గ్రామ సర్వేయర్లు, సిబ్బంది ఉన్నారు.

పంట కాలువలను ప్రక్షాళన చేయాలి

నరసాపురం: నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పంట కాలువలు, మురుగు కాలువలు పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి రైతులకు పంట నీరు సక్రమంగా అందేలా చూడాలని యర్రంశెట్టి వారి పాలెం సర్పంచి, మండల సర్పంచుల ఛాంబర్ మాజీ అధ్యక్షులు కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పంట కాలువలు, మురుగు కాలువల ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి పెట్టి పెదవి వాటిని బాగు చేయించాలని కోరారు.

సామాజిక అంశాలపై అవగాహన

భీమవరం : కిషోర్ వికాసం సమ్మర్ క్యాంప్ ద్వారా యువతులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కిషోర్ వికాసం సమ్మర్ క్యాంప్‌పై సంబంధిత శాఖల అధికారులతో పలు సూచనలను జారీ చేశారు.

'ఇళ్ల తొలగింపునకు టిడిపి మద్దతు'

పాలకోడేరు : ఉండి నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు ప్రభుత్వ భూమిలో ఆక్రమణలో ఉన్న ఇళ్లు తొలగింపుకు తీసుకున్న చర్యలకు పాలకోడేరు టిడిపి మద్దతు ప్రకటించింది. పాలకోడేరులో సోమవారం టిడిపి నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రఘురామకృష్ణంరాజు నియోజకవర్గంలో అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్ తరాల కోసం కోసం పాటుపడుతున్న రఘురామకృష్ణంరాజు అభివృద్ధి చేస్తుంటే కించపరిచే విధంగా మాట్లాడటం సరైంది కాదన్నారు.

అంబులెన్స్ ప్రారంభం

భీమవరం టౌన్ : వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో కీర్తిశేషులు పిప్పళ్ళ అచ్యుతం పద్మావతి వారి కుటుంబసభ్యులు, గ్రామస్తుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను సోమవారం ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వబిలిశెట్టి రామకృష్ణ, సర్పంచి శాంతిప్రియ, పిప్పళ్ళ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శాన్వికి నగదు బహుమతి అందజేత

ఆకివీడు : మండలంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల నుంచి మండల ప్రథమ స్థానం సాధించిన స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ విద్యార్థిని కొల్లి శాన్వికి నగదు బహుమతిని అందజేశారు. ఆ పాఠశాలలో 1980-81 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల బృందం శాన్వికి రూ.13 వేల నగదు బహుమతినిచ్చారు. ఈ బహుమతిని సోమవారం పాఠశాల హెచ్‌ఎం తోట పోతురాజు చేతుల మీదుగా 1981-82 బ్యాచ్‌కు చెందిన స్థానిక యుటిఎఫ్ కార్యదర్శి ఆదిఎన్.నారాయణ విక్రమ, కొప్పర్తి సత్యనారాయణ, గోపాలకృష్ణుల విద్యార్థి, ఆమె తల్లిదండ్రులకు సంయుక్తంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ముత్యాల వెంకటస్వామి, టి.వెంకటేశ్వరరావు, ఎ.అరవింద, రామ్మోహన్‌రావు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

ప్రభుత్వ భూమిని రక్షించండి

వీరవాసరం : అండలూరులో ప్రభుత్వ భూమి సంరక్షించాలని ఎంపిటిసి బొల్లెంపల్లి శ్రీనివాస్‌ఠాకూర్ సోమవారం పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను తహశీల్దార్ ఎమ్.రామాంజనేయులుకు తెలిపారు పేర్కొన్నారు. అండలూరు గ్రామంలో సర్వే నెం.119110లో తొమ్మిది సెంట్ల భూమిని వేంద్ర రాకేష్ అనే వ్యక్తి ఆక్రమించుకుని అనధికార లేఅవుట్ ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి, విఆర్‌ఒలకు తెలిపినా ఆక్రమణదారుడిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆక్రమణలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ భూమిని రక్షణ ఏర్పాటు చేసి పంచాయతీ అవసరాలకు ఉపయోగించాలని ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు వర్క్‌షాప్

తాడేపల్లిగూడెం : నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్(ఎపి నిట్)లోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వచ్చేనెల 12 నుంచి 16 వరకు ఐదు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కార్యక్రమ కోఆర్డినేటర్, ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మ తెలిపారు. త్రీడీ మోడలింగ్ డిజైన్, ప్రింటింగ్, స్కానింగ్ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులు తెలుసుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పరిమిత సంఖ్యలోనే విద్యార్థులను తీసుకుంటామని, ఆసక్తి గల విద్యార్థులు వచ్చేనెల 5వ తేదీలోపు తమ పేర్లను నమోదు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను విద్యార్థులు స్కాన్ చేసి గూగుల్ ఫార్మ్ నింపాలని, ఇతర వివరాలకు 99854 57227, 9010101065 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం : నరసాపురం పురపాలక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 30న బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ తెలిపారు. ఈమేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి సకాలంలో కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నిర్దేశిత గడువులోగా ఫిర్యాదులు పరిష్కారం : ఆర్‌డిఒ

నరసాపురం : పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 49 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించడం జరిగిందని ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు వినికిడి యంత్రాల పంపిణీ

తాడేపల్లిగూడెం : స్థానిక భవిత వికలాంగుల శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న బధిర విద్యార్థులకు మండల విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ, మండల విద్యాశాఖ అధికారి-2 పిఎంకె.జ్యోతి వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా వికలాంగుల పిల్లలకు అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందజేస్తున్నారని, వికలాంగుల పిల్లల్లో లోపాన్ని అధిగమించటానికి ఉపకరణాలు ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం వికలాంగుల పిల్లలకు పరీక్షల్లోనూ, ఉద్యోగాల్లో రాయితీలు కల్పించిందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వికలాంగుల పిల్లలకు సమగ్ర శిక్ష ద్వారా వివిధ రకాల అలవెన్సులు అందజేయపడుతున్నాయని తెలిపారు. భవిత కేంద్రంలో వికలాంగుల పిల్లలకి అవసరమైన ప్రత్యేక విద్య, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ సేవలు ఉచితంగా అందించబడుతున్నాయని, వికలాంగుల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని, పిల్లల్లో చైతన్యం కలిగించి, చదువుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కె.బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, మండల సిఆర్‌పిలు, వికలాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్ అమలు చేయాలి

తణుకు : 12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించి 6 నెలల లోపు అమలు చేయాలని, 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, తణుకు యూనిట్ కార్యదర్శి ఎస్.చలపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం అధ్యక్షులు కాయల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. తొలుత గత సమావేశం నుంచి ఈ సమావేశం వరకు మరణించిన పెన్షనర్లకు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు తిరుమలశెట్టి గోపాలకృష్ణమూర్తికి, జమ్ముకాశ్మీర్‌లోని ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ 1.7.18 నుంచి చెల్లించవలసిన అనేక విడతల డిఆర్ అరియర్స్ చెల్లించాలని తెలిపారు. సంఘ కార్యాలయం మెట్లు శిథిలావస్థకు వచ్చినందున కొత్తగా మెట్లు నిర్మాణం చేయాల్సిన ఆవశ్యకత తెలియజేయగా రిటైర్డ్ కాలేజీ ప్రిన్సిపల్ సంకు మనోరమ, డివివిఎస్ వర్మ దంపతులు రూ.లక్ష, కీర్తిశేషులు మేడపాటి బృందావన జ్ఞాపకార్థం భర్త కర్రి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, రిటైర్డ్ టీచర్ రూ.50 వేలు, కీర్తిశేషులు గోలి వివేకానందస్వామి, రిటైర్డ్ లెక్చరర్, కీర్తిశేషులు మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.25 వేలు, కీర్తిశేషులు జి.హరికృష్ణ జ్ఞాపకార్థం భార్య దివాకర్ల అనురాధ రిటైర్డ్ టీచర్ రూ.20 వేలు విరాళాలు అందజేశారు. నడవలేని వృద్ధులకు కీర్తిశేషులు నాగమల్లి రాధాకృష్ణ జ్ఞాపకార్థం కుమారుడు నాగమల్లి రామకృష్ణ, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ వారు రూ.5 వేలు విలువ చేసే వీల్‌చైర్ బహూకరించారు. అనంతరం సంఘ సభ్యుల్లో 90 సంవత్సరాలు పైబడిన వారికి సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. అసోసియేట్ అధ్యక్షులు డి.రామకృష్ణంరాజు, వైస్ ప్రెసిడెంట్ జి.జోషఫ్, డి.బాపిరెడ్డి , పిఎస్ఎన్.మూర్తి, పివి శేషాచార్యులు, ఎస్.అప్పలరాజు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి

పాలకోడేరు : నిద్ర మత్తులో డాబాపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున మోగల్లులో జరిగింది. పాలకోడేరు ఎస్ఐ ఎం.రవివర్మ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు నాగేశ్వరరావు(45) ఎప్పటి మాదిరిగా డాబాపై నిద్రించి మూత్రవిసర్జన నిమిత్తం వేకువజామున కిందికి దిగే క్రమంలో నిద్రమత్తులో పైనుంచి పడిపోవడంతో అక్కడికక్కడే కన్నుమూశారు. మృతుడుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడు నాగేశ్వరరావు టిడిపికి వీరాభిమాని కావడంతో నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలని, కుటుంబానికి 200 రోజులు పనిదినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఉపాధి పనుల పర్యటనలో భాగంగా సోమవారం మాధవరం గ్రామంలో ఉపాధి పనుల ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, మండల కార్యదర్శి కండెల్లి రమేష్‌బాబు సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఉపాధి పనులు కొలతలతో నిమిత్తం లేకుండా ఉపాధి వేతనం వచ్చేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుత్తుల నరసయ్య, గోపాల వెంకటరావు, ఎం.శ్రీనివాసు, సంద్రసత్యనారాయణ, నాగన్న, సాయి భవాని, డి.చాయమ్మ, పాలంగి లక్ష్మి, కామన పవన సాయి, డొంకా కృష్ణంరాజు పాల్గొన్నారు.

పెనుగొండ : అడిగిన వారందరికీ పని కల్పించాలని, వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్స్‌పై రాజకీయ వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి నిధులు తగ్గించడం ద్వారా కూలీలు రెండు పూటలా పనిచేయాలని, వేసవి భత్యం రద్దు చేస్తామని ప్రకటించడం అన్యాయమని వ్యకాస మండల కార్యదర్శి ఎస్‌కె.పాదుషా అన్నారు. సోమవారం సిద్ధాంతం ప్రాంతాల్లో ఉపాధి కూలీలను కలిసిన సందర్భంలో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని మనమందరం కాపాడుకోవాలని ఈ సందర్భంగా కూలీలకు పిలుపునిచ్చారు.

తణుకు రూరల్ : ఉపాధి హామీ కూలీలకు వేసవిలో చెల్లించవలసిన సమ్మర్ అలవెన్స్‌ను తిరిగి పునరుద్ధరించాలని ఎపి వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొమరవరం గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో సోమవారం కొద్దిసేపు ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు బోదుల్లో పనిచేస్తున్నామని, మద్యం తాగిన సీసాలను పగలగొట్టి పంట బోదుల్లో వేయడం వల్ల కాళ్లు చేతులు తెగి గాయాల పాలై చాలా ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోయారు. గతంలో మాదిరిగా చేసిన పనికి పే స్లిప్పులు ఇవ్వాలని, ఖర్చులు పెరిగిపోయి ప్రభుత్వం చెల్లించే కూలి సరిపోవడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో బందుల లక్ష్మి నిర్మల, పాల ఏసమ్మ, బొంత లక్ష్మి, మంగం నరేష్, జంగం బాబురావు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

సత్కారం పొందిన ఉత్తమ విద్యార్థులు

వీరవాసరం : మండలంలో ఏడు ప్రభుత్వ హైస్కూల్స్‌లో పది పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సోమవారం వీరవాసరం మండల పరిషత్ ఆధ్వర్యంలో సత్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. అండలూరు, కొణితివాడ, రాయకుదురు, వీరవాసరం, మత్స్యపురి, దూసనపూడి, తోలేరు హైస్కూల్‌లో ప్రథమ స్థానాలు పొందిన ఎన్.కోమలశ్రీ, జి.వర్షిణి, జి.నవదీపిక, డి.రేణుజ, బి.దేవిశ్రీ, సిహెచ్.సింహాద్రి అప్పన్న, ఒ.పావనసాయి, కె.సంతోష్, ద్వితీయ స్థానాలు సాధించిన ఎం.కుసుమనిర్మల, సిహెచ్.బాహ్యశ్రీ, రామగణేష్, పి.భోజతేజస్విని, ఎస్.మమతశ్రీ, పి.సుధ, ఎస్.దేవికుమారిలను ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్, ఎంపిపి దుర్గాభవాని ఆలోచనతో మండలంలో ప్రప్రథమంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సాహించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. విద్యార్థులను మేళతాళాలతో అత్యంత వైభవంగా తోడ్కొని సభావేదిక వద్దకు తీసుకొచ్చారు. సర్పంచి చికిలే మంగతాయారు, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, డిఇఒ నారాయణ, డివైడిఇఒ రమేష్, ఎంఇఒ శ్రీమన్నారాయణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పారావు, వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తిలు, ఎంపిటిసి సైదేశ్వరావులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించవలసిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో చినబాబు, నెహ్రు, కాశీ, సాయి, భాస్కరావు, జివివి.రామానుజరావు, విద్యార్థుల తల్లితండ్రులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

లైబ్రరీలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల శిబిరాలను పిల్లలందరూ వినియోగించుకోవడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల రామారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల మానవత సంస్థ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, విశ్రాంత తహశీల్దార్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, మానవతా ప్రతినిధులు మురళీకృష్ణ, పి.సువర్ణ గౌరి, లైబ్రరీ అధికారి పిటి.శివకుమార్ మాట్లాడారు. ఈరోజు లైబరీలో పుస్తక ప్రదర్శన చదవడం మా కిష్టం ప్రోగాం నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వీరవాసరం: ఈనెల 28 నుంచి మే 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం వీరవాసరం శాఖ గ్రంథాలయంలో ప్రారంభమైంది. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందని గ్రంథపాలకుడు హనుమంతరావు తెలిపారు. ఈ శిబిరంలో విద్యార్థులకు వి లవ్ రీడింగ్ అనే పేరుతో ఈ శిబిరాన్ని కొనసాగిస్తామన్నారు. వివిధ కథల పుస్తకాలు చదివించుట, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, చెస్ మొదలైన వాటిపై అవగాహన కల్పించబడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పంపన సాయి బాబు, బండారు సత్యనారాయణ, గంట సత్యనారాయణ, రీడర్సు కరాసు శ్రీనివాసరావు, టీచర్ శ్రీరంగనాథ్, మతలు పెద్దబ్బాయి పాల్గొన్నారు.

తణుకు : చదువుతో పాటు ఇతర విద్యల్లో కూడా ప్రావీణ్యం సంపాదించుకొని ప్రతిభావంతులుగా తయారుకావాలని గ్రంథాలయ అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి సూచించారు. సోమవారం జిల్లా గ్రంథాలయం వారి ఆదేశాల మేరకు తణుకు పురుషుల శాఖా గ్రంథాలయంలో వేసవి ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో లీడర్స్ ఫారమ్ అధ్యక్షులు కౌరు వెంకటేశ్వర్లు, లైబ్రేరియన్ సుగుణకుమారి పాల్గొన్నారు.

ఉండి: ఉండి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు పివి శ్యామల రావు అన్నారు. ఉండి గ్రంథాలయ అధికారి జెవి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రారంభించిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డ్రాయింగ్ పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, పెయింటింగ్ వంటి వాటిపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు గ్రంథాలయంలో జరిగే ఈ శిబిరంలో పాల్గొనాలని ఆయన కోరారు.

మేడే ర్యాలీ, సభల్లో కార్మికులు పాల్గొనాలి

తణుకు : మేడే ర్యాలీ, సభల్లో ఉద్యోగ, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ తెలిపారు. సోమవారం అంగన్వాడీ, స్టేట్‌వేరింగ్ కార్పొరేషన్ హమాలీ కార్మికుల వద్ద సిఐటియు ఆధ్వర్యాన మేడే పోస్టర్లు ఆవిష్కరించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్స్‌కి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సంఘటిత, అసంఘటిత కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, పెరుగుతున్న ధరలు తగ్గించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులు గత ప్రభుత్వ కాలంలో 42 రోజులు సమ్మె చేసినా వేతనం పెంచలేదని విమర్శించారు. ఆనాటి ప్రతిపక్షంలో ఉన్న పార్టీ నేడు అధికారంలోకి వస్తే అంగన్వాడీ వేతనాలు పెంచుతామని చెప్పిన మాట నేటికి ఆచరణలో అమలు చేయలేదన్నారు. అంగన్వాడీలపై పనిభారం తగ్గిస్తామని అన్నారని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సమస్యల పరిష్కార దిశగా ఆలోచన పాలకులకు లేకపోవడం బాధాకమన్నారు. స్టేట్ వేరింగ్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న హమాలీలకు నేటికీ ఇఎస్ఐ సౌకర్యం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు కూడా పెరగడం లేదన్నారు. మేడే స్ఫూర్తితో సమస్యలపై పోరాటం రానున్న కాలంలో చేస్తామని ప్రతాప్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, చిటికిన నాగబాబు, ఏడుకొండలు, టి.తులసయ్య, కనకదుర్గ, కనకమహాలక్ష్మి, రమాదేవి, సత్య, సుబ్బలక్ష్మి, మధు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన మేడే పోస్టర్ల ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 139వ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే గోడపత్రికను స్థానిక సిఐటియు కార్యాలయంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ కార్మికుల శ్రమ లేనిదే పెట్టుబడి దారులకు సంపద లేదని ఆయన అన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, కర్రి దొరయ్య, పోలా చంద్రశేఖర్, తట్టాగొట్టి పెద్దిరాజు, మద్దూరి ఆనంద్, సారిక శ్రీను, సుంకర శ్రీను పాల్గొన్నారు.

మొగల్తూరు : మే డేను కార్మికులు ఘనంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తటలో సచివాలయం వద్ద అంగన్వాడీలతో కలిసి మే డే గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.సారమ్మ, టి.కుమారి, బి.శాంతకుమారి, పి.రేఖ శాంభవి, ఎస్.రామ సీత ఉన్నారు.

భీమవరం టౌన్ : మండలంలోని రూరల్‌లో సోమవారం తోకతిప్ప గ్రామంలో స్థానిక భవనంలో సిఐటియు ఆధ్వర్యాన మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, కె.మల్లేశ్వరి, పి.విజయకుమారి, కె.దుర్గ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీకి గోల్డ్ మెడల్

భీమవరం : జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ అందించిన సేవలకు గుర్తింపుగా ఈ ఏడాదితో పాటు వరుసగా మూడేళ్ల రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్‌కు ఎంపికైంది. మే 8న వరల్డ్ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయవాడ రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్, ఐఆర్‌సిఎస్ రాష్ట్ర శాఖ ప్రెసిడెంట్ చేతుల మీదుగా కలెక్టర్, ఐఆర్‌సిఎస్ జిల్లా శాఖ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి గోల్డ్ మెడల్‌ను అందుకోనున్నారు. స్థానిక కలెక్టరేట్లో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఐఆర్‌సిఎస్ జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ ఎంఎస్‌విఎస్ బద్రిరాజు కలెక్టర్‌కు పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సేవలకు గోల్డ్ మెడల్‌ను సాధించడం అభినందనీయమని, దీనికి కృషిచేసిన జెసి, డిఆర్‌ఒ, జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది అభినందనీయులన్నారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంలో కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

నెలాఖరు వరకూ ఇకెవైసికి గడువు

యలమంచిలి: ఇకెవైసి చేయించుకోవడానికి నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉందని తహశీల్దార్ గంధి పవన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు సంబంధించి ఇంకా 4,100 రికార్డులు పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత వివరాలు రేషన్ డీలర్ల వద్ద ఉన్నాయని లబ్ధిదారులు వాటిని పరిశీలించుకొని జాబితాలో వారి కుటుంబసభ్యులలో ఎవరిదైనా పేరు ఉన్నట్టు అయితే, వెంటనే వారి ఇకెవైసి చేయించుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఉగ్రవాద దాడికి నిరసన

తణుకు : దేశం, మతం, ప్రాంతం ఏదైనా ప్రతీ ఒక్కరిలో మానవత్వం ఉండాలని మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు అన్నారు. సోమవారం జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో గత 22వ తేదీన జరిగిన ఉగ్రవాద దాడికి నిరసన తెలియజేస్తూ స్థానిక మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కాలేజీ వారి ఆధ్వర్యంలో స్కేటింగ్ విద్యార్థులతో చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజీ నుంచి నరేంద్ర సెంటర్ వరకు స్కేటింగ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.జ్ఞానమంజరి, ప్రధానోపాధ్యాయిని ఎస్.లక్ష్మి, ఎకడమిక్ డైరెక్టర్ పి.కిషోర్‌కుమార్, స్కేటింగ్ కోచ్ ఎ.భార్గవ్, పిఇటి శివ పాల్గొన్నారు.

భీమవరం : కాశ్మీర్లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ, కాల్పులలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తూ భీమవరం జర్నలిస్టులు సోమవారం సాయంత్రం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ప్రకాశం చౌక్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ రాజు, నాని, తాతారావు, నాగరాజు, ఆరేటి శ్రీనివాస్, మూర్తి, శ్రీనివాస్, సీతారామరాజు, బ్రహ్మాజీ, నరేష్, బోనం శ్రీను, అరుణ్, ఆది, అయ్యప్ప, రవి పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి : కమిషనర్

తాడేపల్లిగూడెం : పట్టణ ప్రజలు ఇంటి పన్నులు, కులాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు ఈనెల 30వ తేదీ లోపు చెల్లించాలని ప్రజలకు అవగాహన కల్పించడానికి మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ సిబ్బంది, సానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌విఆర్ సర్కిల్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఓవర్ బ్రిడ్జి మార్కెట్ న్యూ ఫ్లైఓవర్ కడకట్ల వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మున్సిపల్ ఎంఇ వెంకటరమణ, మేనేజర్ రవి సుధాకర్, టిపిఇ జగదీష్ పాల్గొన్నారు.

షటిల్ కోర్టు ప్రారంభం : ఎస్‌పి

భీమవరం టౌన్ : మానసిక వికాసానికి, శారీరక ధృఢత్వానికి క్రీడలు ఎంతో కీలకమని, పోలీసుల పని ఒత్తిడిని జయించడానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్ట్‌ను ఆయన ప్రారంభించారు. అదనపు ఎస్‌పి(అడ్మిన్) వి.భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత పాటించాలి : ఎంపిడిఒ

యలమంచిలి : హోటల్స్ నడిపే యాజమానులు, ఇతర వ్యాపారాలు చేసే వారంతా తప్పనిసరిగా ఆహార భద్రతను పాటించాలని యలమంచిలి ఎంపిడిఒ నందిపాటి ప్రేమాన్విత అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ పార్టనర్ కెవిజివిఎం ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఐ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫోస్టాక్ శిక్షణా సర్టిఫికెట్స్ అందించే కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి, కల్తీని గుర్తించాలి, భద్రతగా ఆహారాన్ని అందించాలని తెలియజేసారు. జిల్లా టీం హెడ్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు, మండల ఎగ్జిక్యూటివ్స్ డి.నవీన్, హేమంత్, యజమానులు పాల్గొన్నారు.

మే, జూన్‌లో ప్రత్యేక రైళ్లు

నరసాపురం: వేసవి రద్దీని పరిగణలోకి తీసుకుని మే, జూన్ నెలల్లో నరసాపురం-చర్లపల్లిల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ఎస్ఎం గణపతి మధుబాబు చెప్పారు. 07233 నెంబర్ చర్లపల్లిలో మేలో 2, 9, 16, 23, 30, జూన్లో 6, 13, 20, 27 తేదీల్లో నరసాపురానికి ప్రత్యేక రైలు నడుస్తుందన్నారు. ఈ రైలు చర్లపల్లిలో రాత్రి 8.15కి బయలుదేరి నరసాపురం ఉదయం 5.50కి చేరుకుంటుందన్నారు. తిరిగి ఈ రైలు 07234 నెంబర్లో మేలో 4, 11, 18, 25, జూన్లో 1, 8, 15, 22, 29 తేదీల్లో రాత్రి 8 గంటలకు నరసాపురం నుంచి వెళుతుందన్నారు. నల్గొండ, మిర్యాలగూడ, సత్తినిపల్లి, గుంటూరు, విజయవాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు మీదుగా నడుస్తుందన్నారు.

మహారాజశ్రీ VI అడిషనల్ జుడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేటు, రాజమండ్రి వారి కోర్టులో

D.V.C. 5/2022

Between:

రెడ్డి చిన్న, W/o. గోపాలకృష్ణ, కామరాజుపేట, గోకవరం మండలం -పిటిషనరు

మరియు

రెడ్డి రాంబాబు, S/o. అప్పారావు, డో.నెం. 6-113, కొబ్బరితోట వీధి, రామాలయం వద్ద, పెంటపాడు, పశ్చిమగోదావరి జిల్లా -రెస్పాండెంటు

పై వ్యాజ్యము పిటిషనరు మీపై గృహహింస మరియు తదితర పరిహారములు కోరుచూ దాఖలు చేసియున్నారు. పై కేసు 6వ జుడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేటు వారి కోర్టులో రాజమండ్రి పెండింగులో మీ యొక్క సమాధానము కొరకు హాజరు కావలసినదిగా శ్రీ కోర్టు వారు ది. 26-5-25 నకు వాయిదా వేసియున్నారు. కావున పై తేదీన అనగా **ది. 26-5-2025న ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టుకు మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలసి యున్నది. లేని యెడల మీకు పరోక్షముగా నిర్ణయించబడును.

జి.యు.వి.బి.రాజు
రాజమండ్రి 28-4-25
అడ్వకేట్, రాజమండ్రి
సెల్: 9848370855

గ్రామపంచాయతీ కార్యాలయము, కాకరవాడ

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.02/2025 తేది.26-04-2025

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, కాకరవాడ గ్రామపంచాయితీకి ది.01-04-2025 తేది నుండి ది.31-03-2026 వరకు అనగా ఒక సం॥ కాలమునకు ఈ దిగువ తెలిపిన పనులకు కాంట్రాక్ట్ లేబరు పద్ధతిపై పనిచేయుటకు ది.29-04-2025వ తేది మధ్యాహ్నం 12.00 గంటలకు ముదినేపల్లి మండలం, కాకరవాడ గ్రామపంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, (లేదా) వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడి, తిరిగి అదే రోజు మధ్యాహ్నం 1-00 గంటకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన విషయములు గ్రామపంచాయితీ కార్యాలయము పనిచేయు వేళలందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనివివరము	కాలపరిమితి	డిపాజిట్
1	PWS స్కీమ్ మోటారు ఆపరేటర్ -1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ.1000/-
2	వీధి దీపముల రిపేర్లు ఎలక్ట్రీషియన్ -1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ.1000/-
3	పారిశుద్ధ్య పనుల నిర్వహణ నిమిత్తం స్వీపరు-1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ.1000/-

మొత్తం-3 వ్యక్తులు

సం/- శ్రీ ఇంతేటి గణేష్
సర్పంచ్, కాకరవాడ గ్రామపంచాయితీ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సం/- శ్రీమతి కె. కృష్ణవేణి
గ్రామపంచాయితీ కార్యదర్శి, కాకరవాడ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.